సాక్షి
వికారాబాద్

సోమవారం ¦ 29 ¦ ఏప్రిల్ ¦ 2024



సాగు భళా.. అమ్మడమెలా?

ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్నకు సరైన మార్కెట్ లేక రైతన్నలు అవస్థలు పడుతున్నారు. 8లో▸



మోదీ ప్రభుత్వం ఖాయం

చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి కొండా సంగీతారెడ్డి ఓటర్లను కోరారు. 8లో▸



కొనేవారు రాక..

పంటలు చేతికి వచ్చినా కొనేవారు లేకపోవడంతో రైతన్నలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు అందిస్తాం

డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం



కొత్తపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పూడూరు: ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన రావాలని డీసీసీ ఉపాధ్యక్షుడు కద్మూరు ఆనందం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చీలాపూర్, కొత్తపల్లి, సిరిగాయపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క హామీని పూర్తిచేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అర్హులందరికీ ఆరు గ్యారెంటీలను అందిస్తుందన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పెంటయ్య, షకీల్, మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు రఘురాం రెడ్డి, భాస్కర్, వెంకటదాస్, రామక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



బొంరాస్‌పేట: ఏప్రిల్‌లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు వికారాబాద్ జిల్లా నుంచి శ్రీ సాయి మార్షల్ ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ నుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా కిక్ బాక్సింగ్ జనరల్ సెక్రెటరీ, కరాటే కిక్ బాక్సింగ్ మాస్టర్ సాయిలు తెలిపారు. హస్నాబాద్ గ్రామానికి చెందిన విద్యార్థులు కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికై న విద్యార్థులకు మాస్టర్ సాయిలు, మహేష్ కురుమ, వెంకటయ్య తదితరులు అభినందించారు.

శభాష్.. అనిల్



అనిల్‌ను సన్మానించిన నాయకులు

కొడంగల్: ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల్లో రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించిన అనిల్ కుమార్‌ను కొడంగల్ ఎంపీపీ ముద్దప్ప ఆదివారం ఘనంగా సన్మానించారు. కాగా మున్సిపల్ పరిధిలోని బూల్కాపూర్‌కి చెందిన అనిల్‌కుమార్ పరిగిలోని మహాత్మా జ్యోతీరావ్ పూలే ప్రభుత్వ గురుకుల కళాశాలలో చదువుతూ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 466 మార్కులు సాధించి రికార్డు సృష్టించాడు. అనిల్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత చదువులు చదివి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, డీపీఎస్ అధ్యక్షుడు జయతీర్థాచారీ, మాజీ జెడ్పీటీసీ ఏస్కుల భాస్కర్, డాక్టర్ సాకేత్, రాజు పాల్గొన్నారు.

గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా : చామల



మాట్లాడుతున్న చామల కిరణ్ కుమార్ రెడ్డి

తుర్కయంజాల్: లోక్‌సభ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అభ్యర్థించారు. మున్సిపల్ పరిధి రాగన్నగూడలోని ప్రముఖ్ టౌన్‌షిప్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలు తనకు తెలుసని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిలర్లు మర్రి మాధవి, కుంట ఉదయశ్రీ, రేవల్లి హరిత, నాయకులు సామ భీంరెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎల్మటి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా బకాయిలు

రూ.2 కోట్లు దాటిన అద్దె, వ్యాపార వాహనాల ట్యాక్స్

- మూడు నెలలకు ఒకసారి చెల్లించాల్సి ఉన్నా ముందుకు రాని వైనం
- ఈనెల దాటితే 200 శాతం ఫైన్
- జిల్లాలో ఎల్లో ప్లేట్ వాహనాలు 15వేలు
- మే మొదటి వారంలో స్పెషల్ డ్రైవ్



వాహనదారుడికి జరిమానా రసీదు ఇస్తున్న ఆర్టీఏ అధికారులు (ఫైల్)

వికారాబాద్: అద్దె, వ్యాపార అవసరాల కోసం వినియోగించే ఫోర్ వీలర్ వాహనాల ట్యాక్స్ బకాయిలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఎక్కడ చెల్లించాలో తెలియక కొందరు, అవగాహన లేక మరి కొందరు పన్ను కట్టడం లేదు. గతంలో ఎల్లో ప్లేట్ వాహన ట్యాక్స్ ఆర్టీఏ కార్యాలయంలో చెల్లించేవారు. పన్ను చెల్లింపునకు అధికారులు వెసులుబాటు కల్పించారు. మీ సేవా కేంద్రాల్లో కట్టేందుకు అవకాశం కల్పించారు. అయినా వాహనదారులు సకాలంలో చెల్లించడం లేదు. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో వాహనం పట్టుబడితే ఫైన్ రూపంలో వేలకు వేలు అదనంగా చెల్లించి నష్టపోతున్నారు. గడువులోగా చెల్లిస్తే వెయ్యి రూపాయలతో అయిపోయే పన్ను గడువు దాటాక రూ.1,500 చెల్లించాల్సి వస్తోంది. అదే ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే 200శాతం అధికంగా ఫైన్‌తో పన్ను కట్టాలి.

పేరుకుపోతున్న బకాయిలు

జిల్లాలో 2.30 లక్షల వాహనాలు ఉన్నాయి. ఇందులో 15వేలకు పైగా ఎల్లో ప్లేట్ వాహనాలు ఉన్నాయి. త్రీ ప్లస్ వన్ మొదలుకొని సెవెన్ సీటర్ ఆటోల వరకు క్వార్టర్లీ పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఫోర్ వీలర్ ట్యాక్సీ ప్లేట్ వాహనాలు మొదలుకొని సరుకు రవాణా, వ్యాపార వాహనాలకు ప్రతి మూడు నెలలకు ఒక్కసారి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి వాహనాలు జిల్లాలో ఆరు వేల వరకు ఉండగా ఇందులో ఐదు వేల వాహనాల పన్నులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మొత్తం రూ.2 కోట్లు దాటినట్లు అధికారుల ద్వారా తెలిసింది.

గడువు దాటితే ఫైన్

పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు ఈ నెల చివరి వరకు అవకాశం ఉంది. అప్పటిలోగా కేవలం పన్ను మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. గడువు దాటితే (మే ఒకటవ తేదీ తర్వాత) 50శాతం ఫైన్‌తో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆర్టీఏ అధికారులు తనిఖీల్లో పట్టుబడితే 200శాతం ఫైన్ కట్టాలి. అంటే రూ. వెయ్యి చెల్లించాల్సిన చోట రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. మే మొదటి వారంలో ఆర్టీఏ అధికారులు పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా భారీ వాహనాలు, ఎల్లో ప్లేట్ ప్యాసింజర్ వాహనాలు, స్కూల్ బస్సులు, ఫోర్ వీలర్ గూడ్స్ వెహికల్స్, వ్యాపార సంబంధమైన ట్రాక్టర్లు, బోరు బండ్లు, జీపీ, మున్సిపల్ చెత్త వాహనాలకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

మీ-సేవలో పన్ను చెల్లించొచ్చు



అద్దె, వాపార వాహనాలకు సంబంధించిన ట్యాక్స్ మీ-సేవ కేంద్రంలో చెల్లించేందుకు అవకాశం ఉంది. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి పన్ను చెల్లిస్తే ఎలాంటి అపరాధ రుసుం కట్టాల్సిన పని లేదు. కొంతమంది వాహనదారులు పాడైన వాహనాల సమాచారాన్ని తమకు తెలియజేయడం లేదు. స్క్రాప్ చేసి విక్రయిస్తున్నారు. ఇంకొందరు వర్క్ షాప్‌లలో ఏళ్ల తరబడి వదిలేస్తున్నారు. దీంతో వాటికి ట్యాక్స్ పడుతూనే ఉంటుంది. పాడైన వాహనాల సమాచారం ఇస్తే వాటి నంబర్లు రద్దు చేసి పన్ను జాబితా నుంచి తొలగిస్తాం.

– వెంకట్‌రెడ్డి, డీటీఓ, వికారాబాద్

రుణమాఫీ చేయకుంటే రాజీనామా చేస్తా

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- పెద్దేముల్‌లో యూత్ కాంగ్రెస్ నేతలతో సమావేశం
- బీజేపీ, బీఆర్ఎస్‌ను బొందపెట్టాలని పిలుపు

తాండూరు టౌన్: సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 15వ తేదీలోపు రూ.2లక్షల రైతు రుణమాఫీని అమలు చేసి చూపిస్తారని.. అలా చేయని పక్షంలో తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం అంతారం సమీపంలో పెద్దేముల్ మండలస్థాయి యూత్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి యూత్ నాయకులే కొండంత అండ అన్నారు. యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. అప్పుడు బీఆర్ఎస్‌ను బొంద పెట్టామని, ఇప్పుడు బీజేపీ వంతు వచ్చిందన్నారు. నిరుద్యోగులు, పేద, మధ్యతరగతి ప్రజలను దారుణంగా మోసం చేసిన బీజేపీని కూకటి వేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి తాండూరు నియోజకవర్గం నుంచి 25వేలకు తగ్గకుండా మెజార్టీ తీసుకురావాలని కోరారు. చేవెళ్ల సెగ్మెంటు ఇన్‌చార్జి, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు గెలవడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ప్రజలు తిరస్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేశ్ నాయకులు.. కృష్ణంరాజు, శివారెడ్డి, ధారాసింగ్, మురళీకృష్ణ, సతీష్ రెడ్డి, అంకిత్, సంతోష్, గోపాల్, పురుషోత్తంరావు, నర్సింహులు, వెంకటేశ్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పూజలో ఎమ్మెల్యే

తాండూరు రూరల్: మండల పరిధిలోని బెల్కటూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. మహిళలు బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

మున్సిపల్ కార్మికుడిపై దాడి

కొడంగల్ పీఎస్‌లో కేసు నమోదు



ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

కొడంగల్: విధి నిర్వహణలో ఉన్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడుపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలని కోరుతూ మున్సిపల్ సిబ్బంది ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఆదివారం ఉదయం పని చేయడానికి వెళ్తున్న పారిశుద్ధ్య కార్మికుడు మల్కప్పపై కొడంగల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో దారుణంగా దాడిచేశారు. ఈ విషయమై కొడంగల్ పీఎస్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులపై దాడిచేయడం అమానుషమని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్నారు



షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

కేంద్ర ప్రభుత్వంపై సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ ఫైర్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే స్ఫూర్తితో పెట్టుబడి, దోపిడీదారుల దౌర్జన్యాలు, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడి.. హక్కులు సాధించుకుంటూ కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఎనిమిది గంటల పనిదినం కోసం ఎంతోమంది కార్మికులు పోరాటం చేశారని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశీ పెట్టుబడిదారుల మోజులో పడి కార్మిక వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా చట్టాలను చేసిందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. మేడే సందర్భంగా నిర్వహించే కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి..

ఇబ్రహీంపట్నం రూరల్: దేశంలో కార్మిక చట్టాలకు తూట్లు పొడిచి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న బీజేపీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.భూపాల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో ఆదివారం సీఐటీయూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ భూపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ కార్మిక చట్టాలను మార్చి ఎనిమిది గంటల పని దినాన్ని లేకుండా చేసి 12 గంటల పని దినాలను తెచ్చే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌లతో కనీస వేతనం అమలయ్యే పరిస్థితి లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు జగదీశ్, స్వప్న, రుద్రకుమార్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు సన్మానం



రేవంత్‌రెడ్డిని సన్మానించిన కురుమ సంఘం నాయకులు

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కురుమ సంఘం రాష్ట్రస్థాయి జేఏసీ నాయకులు సన్మానించారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించే కురుమల ఆత్మీయ సమ్మేళనం, కొల్లూరు మల్లప్ప చిత్రపటం ఆవిష్కరణకు రావాలని ఈ సందర్భంగా వారు సీఎంకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తకురుమ శివకుమార్, హైకోర్టు న్యాయవాది, రాష్ట్ర సంఘం కార్యదర్శి మల్లేశ్, ఆ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీత ప్రచారం



పరిగిలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

పతుల కోసం సతులు

ప్రచారంలో అభ్యర్థుల బంధుగణం

- తమవారి గెలుపు కోసం రంగంలోకి..
- ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు అభ్యర్థన
- మండుతున్న ఎండలను సైతం లెక్క చేయక పర్యటనలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థుల తరఫున పార్టీ శ్రేణులే కాదు.. అభ్యర్థుల సతీమణులు, బంధువులు ప్రచార రంగంలోకి దిగారు. అభ్యర్థుల గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఉదయం వేళల్లో పార్కులు, యోగా కేంద్రాల్లో ప్రచారం చేస్తూ.. సాయంత్రం వేళ కాలనీ సంక్షేమ సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం భగ్గున మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా మండల కేంద్రాలు, మారు మూల గ్రామాల్లో పర్యటిస్తున్నారు. స్థానికంగా ఉన్న పార్టీ కేడర్‌ను వెంట బెట్టుకుని ముందుకు సాగుతున్నారు. అవ్వ.. తాత.. పెద్దమ్మ.. పెద్ద నాన్న.. అన్నా.. వదిన.. తమ్ముడు.. చెల్లి అంటూ వరుసలు కలిపి కనిపించిన వారినల్లా ఆప్యాయంగా పలకరిస్తున్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే.. ఏమేమి చేయనున్నారో వివరిస్తున్నారు. వారి ప్రచార ప్రయత్నం ఏ మేరకు ఫలిస్తుందో వేచి చూడాలి.

ఎవరెక్కడ ప్రచారం చేశారంటే ..

- చేవెళ్ల లోక్‌సభ స్థానం బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి పరిగిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
- కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీతారంజిత్‌రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఇస్తాన్నా విల్లాస్‌లో ప్రచారం చేయగా, కుమార్తె పూజా ఆకాంక్ష రెడ్డి ఇస్తానా ల్యాంకోహిల్స్‌లో ప్రచారం చేశారు.
- బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరఫున ఆయన సతీమణి చంద్రకళ శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఆయన కుమారుడు వీరేశం వికారాబాద్, చేవెళ్ల, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు.
- కాంగ్రెస్ మహబూబ్‌నగర్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సతీమణి చల్లా అశ్లేషారెడ్డి షాద్‌నగర్, కేశంపేట మండలాల్లో ప్రచారం నిర్వహించారు.
- కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి చామల డింపుల్ రెడ్డి మంచాల మండలం ఎల్లమ్మ తండాలో ప్రచారం చేశారు.
- కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి తరఫున ఆయన కుమారుడు ఆర్యన్ రెడ్డి శంకర్‌పల్లిలో ప్రచారం నిర్వహించారు.



రాజేంద్రనగర్‌లో కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ



మంచాల మండలం ఎల్లమ్మతండాలో కిరణ్‌కుమార్‌రెడ్డి సతీమణి డింపుల్

'కాసాని'ని గెలిపిద్దాం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మొయినాబాద్: వ్యాపార వేత్తలు రాజకీయాల్లోకి వస్తే రాజకీయాలను కూడా వ్యాపారంగా మారుస్తారని.. జిల్లాలో అదే జరగబోతోందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్టార్ కన్వెన్షన్‌లో ఆదివారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గం ప్రజలు కేసీఆర్ పంపిన అభ్యర్థినే ఇప్పటి వరకు గెలిపించారన్నారు. 2014లో కొండా విశ్వేశ్వరరెడ్డి, 2019లో రంజిత్‌రెడ్డి కారు గుర్తుపైనే గెలిచారని గుర్తు చేశారు. ఇప్పుడు కేసీఆర్ బడుగు బలహీన వర్గాల నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను పంపారని.. ఆయన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ ప్రాంతంలో 111 జీవో ఎత్తేసి కొత్త జీవో తెచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. రంజిత్‌రెడ్డి మానవత్వం లేని మనిషని.. ఎవరో తెలియని రంజిత్‌రెడ్డిని ఎంపీగా చేసి ఆయనకు మంచి స్థానం కల్పిస్తే కేసీఆర్ కష్టాల్లో ఉన్నప్పుడు వదిలేసి వెళ్లారని మండిపడ్డారు. కొందరు నాయకులు పార్టీ వదిలి వెళ్లారని ఎవరూ అధైర్య పడొద్దని.. ఈ ఎన్నికల్లో గట్టిగా పనిచేసి ఎంపీగా కాసానిని గెలిపిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరే నాయకులవుతారన్నారు. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే కాలె యాదయ్య, లోక్‌సభ ఇన్‌చార్జి రాంబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, జెడ్పీటీసీ శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ అనంతరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మైనార్టీ నేత షేక్ మహబూబ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవూఫ్, రాజు, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, గణేశ్‌రెడ్డి, రితీష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రారంభమైన సమ్మర్ క్యాంపు



విద్యార్థులకు శిక్షణ

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలో గల ధన్నారం స్వామి వివేకనందా గురుకుల్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ స్కూల్‌లో ఆదివారం గ్రామీణ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సమ్మర్ క్యాంపు(పూర్ణ వికాస్) ప్రారంభమయ్యింది. క్యాంపులో భాగంగా 250 మంది విద్యార్థులు వచ్చారని, మే 12 వరకు కొనసాగుతుందని స్కూల్ నిర్వాహకుడు డాక్టర్ ఉజ్వల్‌రాజ్ తెలిపారు. నిత్యం విద్యార్థులకు అవుట్‌డోర్, ఇండోర్ ఆటలు నేర్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బావిలోకి దూకి మహిళ బలవన్మరణం



పార్వతమ్మ(ఫైల్)

చేవెళ్ల: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ మనస్తాపం చెంది బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని ఊరెళ్లలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి పార్వతమ్మ(65) గర్భసంచి తొలగింపు ఆపరేషన్ అనంతరం కడుపునొప్పితో బాధపడుతోంది. వైద్యం చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపంతో శనివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు సాయంత్రం వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులోని బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో అక్కడి వెళ్లిచూసి పార్వతమ్మగా గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదివారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

టిప్పర్ సీజ్

యజమాని, డ్రైవర్‌పై కేసు

కేశంపేట: నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేసి డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రం మీదుగా మట్టితరలిస్తున్న టిప్పర్‌ను ఆపి డ్రైవర్‌ను పత్రాలు చూపమన్నారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ శివకుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ లింగం కేసునమోదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అత్తాపూర్: గుర్తుతెలియని మృతదేహాన్ని అత్తాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కానిస్టేబుల్ నరేష్ రెడ్డి వివరాల ప్రకారం.. అత్తాపూర్ భరత్‌నగర్ కాలనీలో గుర్తుతెలియని ఓ వ్యక్తి (50) మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎండ తీవ్రతకు చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ..

షాద్‌నగర్ రూరల్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. పట్టణంలోని జడ్చర్ల రహదారిలో గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. పట్టణ ప్రధాన కూడలి మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లేందుకు డ్రైవర్ బస్సును యూటర్న్ తీసుకునే క్రమంలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వ్యక్తి తలపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినా.. ఆచూకీ లభించిన పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

సాగు భళా.. అమ్మడమెలా?

- కొనుగోలు కేంద్రాలు లేక మొక్కజొన్న రైతుల అవస్థలు
- అందినకాడికి దోచుకుంటున్న దళారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పెద్దేముల్‌లో మొక్కజొన్న రాశులు

పెద్దేముల్: ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్నకు సరైన మార్కెట్ లేక రైతన్నలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పంటను విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలు లేక దళారులను ఆశ్రయించి చేతులు కాల్చుకుంటున్నారు. పదేళ్ల నుంచి మొక్కజొన్న పంటను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. పత్తి, కంది పంటల బదులు మొక్కజొన్నను పండించిన అందుబాటులో మార్కెట్ లేక ఇబ్బందులు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేలలు అనువైనవి

మండలంలోని నాగులపల్లి, తట్టెపల్లి, మంబాపూర్, పెద్దేముల్, కందనెల్లితండా, జనగాం, ఇందూరు, గాజీపూర్, గోట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో రైతులు సుమారు 350 ఎకరాలల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఇక్కడి నేలలు అనువైనవిగా ఉండటంతో ఏటా మొక్కజొన్నతో పాటు స్వీట్‌కార్న్‌ను సాగు చేస్తున్నారు. ఎకరా మొక్కజొన్న సాగుకు సుమారు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతుంది. 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. దీంతో కొనుగోలు కేంద్రం లేక దళారులను ఆశ్రయిస్తున్నారు. పంట సాగు చేయడం ఓ వంతు అయితే దాన్ని విక్రయించడానికి యుద్ధమే చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

మండిపడుతున్న రైతులు

ప్రభుత్వాలు, పాలకులు మారిన రైతుల గోస ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం, కంది, పెసర, మినుము పంటలకు ఎలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందో.. అదే విధంగా మొక్కజొన్న పంటలకు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. పంటను 40 కిలో మీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ మార్కెట్‌కు తరలించాల్సి వస్తుందని ఆక్షేపిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అధికారులు తాండూరులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అందుబాటులో మార్కెట్ లేక

మొక్కజొన్న పంటకు తాండూరులో మార్కెట్ లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. మర్పల్లి, వికారాబాద్, మోమిన్‌పేట ప్రాంతాల నుంచి దళారులు వచ్చి ఇక్కడ విక్రయాలు చేస్తున్నారు. వారు చెప్పిందే వేదం.. చేసిందే వ్యాపారం అంటూ కొనుగోళ్లు జరుపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ అందుబాటులో లేక క్వింటాకు రూ.400 నుంచి రూ.500లు తగ్గించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

“ గిట్టుబాటు కావడం లేదు



దళారులు చెప్పిన మాటకే విక్రయాలు చేస్తున్నాం. మద్దతు ధర లభించక చేసిన కష్టం గిట్టుబాటు కావడం లేదు. ఓ సమయంలో పెట్టుబడులు సైతం వచ్చే ఆస్కారం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, మద్దతు ధర కల్పించాలి.

– నందారెడ్డి, రైతు, తింసాన్‌పల్లి

దళారులు చెప్పిందే వేదం



కూలీల ఖర్చులు పెరగడంతో పాటు ఎరువుల ధరలు పెరుగుతున్నందున క్వింటాళ్లకు రూ.3 వేలు ధర ఉంటే బాగుంటుంది. మార్కెట్ లేక దళారులు చెప్పిందే వేదం అనాల్సి వస్తోంది. ఇదేంటని ప్రశ్నిస్తే పట్టించుకోవడం లేదు.

– నషీర్, గాజీపూర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు

విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి



రైతులు మొక్కజొన్నతో పాటు స్వీట్‌కార్న్ పంట విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయాలి. విత్తనాలు లేక వికారాబాద్ నుంచి తెస్తున్నాం. ఇష్టం వచ్చినట్లు అమ్ముతున్నారు. మొక్కజొన్న పంట సాగు వల్ల పశువులకు సైతం మేత దొరుకుతుంది.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, పెద్దేముల్

ప్రజల చూపు కాంగ్రెస్ వైపు



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి ఎంతో మంది ప్రజాప్రతినిధులు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కుల్కచర్ల మండలం పీరంపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఏ విధంగా అధికారం ఇచ్చారో.. దేశంలో సైతం కాంగ్రెస్‌కు ప్రజలు అవకాశమిస్తామన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ దేశానికి ఏం చేసిందో చెప్పాలన్నారు. దేశ ప్రజలకు ఎలాంటి సంక్షేమాలు తీసుకురాకుండా బడా బాబులకు దేశ సంపద మొత్తం కట్టబెట్టిందన్నారు. పేద ప్రజలకు సంక్షేమాలు, చట్టాలను తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసిన వాళ్లను ఈడీలతో బెదిరింపులకు గురి చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఎంతో మంది ప్రజాప్రతినిధులు సిద్ధంగా ఉన్నారని, చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



నర్సింలు (ఫైల్)

బంట్వారం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ గ్రామంలో చోటు చేసుకుంది. కోట్‌పల్లి ఎస్సై స్రవంతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల నర్సింలు(46) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చెట్టుకు ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందాడు. గ్రామస్తులు ఆదివారం ఉదయం మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. కాగా మృతుడి భార్య లలిత కొంతకాలంగా కుమారుడితో కలిసి పుట్టింటి వద్దనే ఉంటున్నారు. భర్త మృతి విషయం తెలియగానే ఆమె గ్రామానికి చేరుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నర్సింలుకు ఇద్దరు సంతానం కాగా కుమార్తెకు వివాహం జరిపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోదీతోనే దేశప్రగతి

కందుకూరు: చేవెళ్ల లోక్‌సభ అభివృద్ధి బీజేపీ కట్టుబడి ఉందని పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, పున్న భిక్షపతి ఆధ్వర్యంలో ఆదివారం రాచలూరు మాజీ సర్పంచ్ పులిగిల్ల శ్రీనివాస్‌చారి, చంద్రయ్య, ఆంజనేయులు, రవీందర్, యాదగిరి, శ్రీశైలం తదితరులు కమలం గూటికి చేరారు. వారికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రగతి, సమగ్రత ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. దేశం కోసం జరుగుతున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేస్తే బూడిదలో పోసిన పన్నీరే అవుతుందన్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు అవడం ఖాయమని జోస్యం చెప్పారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

తాండూరు: వాళ్లంతా ఒకే చోట కలిసి పదో తరగతి చదువుకున్నారు. ఎన్నో జ్ఞాపకాలను మదిలో నింపుకొని జీవన గమనంలో యాభై ఏళ్ల కిందట పయనమయ్యారు. మళ్లీ ఇన్నాళ్లకి ఓ చోటుకి చేరారు. తాండూరు పట్టణంలోని విజయ విద్యాలయ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 1974–75 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యను అభ్యసించిన నాటి విద్యార్థులు దాదాపు 65 ఏళ్ల ప్రాయంలో కలుసుకున్నారు. ఇతర రాష్ట్రాలలో ఉద్యోగ, వ్యాపారాల రీత్యా స్థిరపడిన వారు సైతం కార్యక్రమానికి హాజరై సంతోషంగా గడిపారు. ఈ సమ్మేళనానికి నాటి పదో తరగతి విద్యార్థులతో పాటు 1960 నుంచి 2024 వరకు పాఠశాలలో చదువుకున్న సుమారు 750 మంది విద్యార్థులు హాజరయ్యారు. పూర్వ విద్యార్థులంతా కలిసి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో చదువుకున్న కొందరు పూర్వ విద్యార్థుల మరణం విషయం తెలుసుకొని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు అజయ్‌శంకర్‌గుప్తా మాట్లాడుతూ.. ఇంత పెద్ద ఎత్తున పాఠశాలలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావడం ఎంతో సంతోషానిచ్చిందన్నారు. మనం చదువుకున్న పాఠశాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలు చేసి స్థిర పడ్డారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అల్లాపూరం శరత్కళ, పూర్వ విద్యార్థులు వేణుగోపాల్‌సోని, సి.విజయ్‌కుమార్, ఎ.చంద్రశేఖర్, శెట్టి రమేశ్, మాజీ కౌన్సిలర్ చెన్‌మిళ్ల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థం తర్వాత ఆగిన పెళ్లి

కేశంపేట: పెళ్లి చేసుకుంటానని నిశ్చితార్థం చేసుకుని ముఖం చాటేసిన యువకుడితో పాటు కుటుంబ సభ్యుల పైన కేసు నమోదయింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన చెదురువెల్లి యువతికి తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన యాదగిరితో ఆరు నెలల క్రితం నిశ్చితార్థం చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులు పెళ్లి ఖర్చుల నిమిత్తం భూమిని విక్రయించి, పెళ్లి ముహూర్తం కోసం యాదగిరి కుటుంబ సభ్యులను సంప్రదించగా వారు పెళ్లి ఇష్టం లేదని సాకులు చెప్పారు. యాదగిరి గతంలో ఇద్దరితో నిశ్చితార్థం జరిగిందని బాధితురాలు ఆరోపించారు. కట్నం నిమిత్తం రూ.5లక్షల నగదు, బంగారు ఉంగరం ఇచ్చామని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైటర్ కొన్ని విషయాలను దాచిపెట్టారని బాధితురాలు ఆరోపించి యాదగిరికి గతంలో జరిగిన నిశ్చితార్థ ఫొటోలను చూపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యాదగిరి, అతడి తల్లి కళమ్మ, అక్కలు అలివేలు, శ్రీలతలపై కేసు నమోదు చేశామన్నారు. యాదగిరి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల నగదు, బంగారు రింగ్‌ను ఇచ్చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నా రైటర్ ఈ విషయాలను దాచిపెట్టి మిగతా విషయాలపైనే కేసును నమోదు చేసినట్టు ఆరోపించారు. యాదగిరి తనతో పాటు మరో ఇద్దరితో నిశ్చితార్థం జరిగిన ఫొటోలను మీడియాకు ఇచ్చారు.

కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి



దండుమైలారంలో ప్రచారం చేస్తున్న వెంకటరమణారెడ్డి, కృపేష్

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని దండుమైలారంలో ఎంపీపీ కృపేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎల్మినేడు గ్రామంలో ఇబ్రహీంపట్నం వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్ రెడ్డి ప్రచారం చేపట్టారు. ఆయన వెంట దొమకొండ నర్సింహా, మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి, నర్సింహా, యాదయ్య తదితరులున్నారు.

మూడోసారి మోదీ ప్రభుత్వం ఖాయం

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి



ఎన్నికల ప్రచారంలో సంగీతారెడ్డి

పరిగి: పేద ప్రజల సమస్యల పరిష్కారం చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితోనే సాధ్యమని ఆయన సతీమణి, బీజేపీ నాయకురాలు కొండా సంగీతారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఇబ్రహీంపూర్, గడిసింగాపూర్ గ్రామాలతో పాటు పట్టణ కేంద్రంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణ కేంద్రంలో పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గం చాలా వెనుబడి ఉందని.. గతంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి మాత్రమే గ్రామాల్లో కనిపిస్తుందన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. దేశ ప్రజలు మళ్లీ మూడోసారి బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. కొండా అంటే పేద ప్రజలకు పెద్ద అండా అని అన్నారు. మోదీ చేసిన అభివృద్ధి, దేశాన్ని పాలిస్తున్న తీరును చూసి ప్రజలు ఓటు వేయాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మన దేశ పరిస్థితి ఎంటో గుర్తించుకోవాలన్నారు. ఇతర పార్టీల నుంచి ఎంతో మంది బీజేపీలో చేరుతున్నారని వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి నరసింహ, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

ఆహ్వానించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: తాండూరు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన జావీద్, చాంద్‌భాయ్‌తో పాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలు, సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి తప్పకుండా సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు హబీబ్‌లాలా, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, నాయకులు అబ్దుల్ రవూఫ్, బాల్‌రెడ్డి, పట్లోళ్ల నర్సింహులు తదితరులు ఉన్నారు.

బీజేపీ గెలుస్తోందని వాళ్లకు భయం

పార్టీ నాయకుడు నరేశ్‌మహరాజ్



మాట్లాడుతున్న నరేశ్‌మహరాజ్

తాండూరు: చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ గెలుస్తోందని కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుందని మాజీ మంత్రి చందుమహరాజ్ తనయుడు నరేశ్‌మహరాజ్ విమర్శించారు. ఆదివారం తాండూరు పట్టణంలోని ఆయన నివాసంలో బీజేపీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్‌మహరాజ్ మాట్లాడుతూ.. 2018 అసెంబ్లీ ఎన్నికలలో రోహిత్‌రెడ్డికి టికెట్ ఇప్పించి ఎమ్మెల్యేగా గెలుపునకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కృషి చేశారన్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని విమర్శించడం హేయమన్నారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి తాండూరులో పార్టీకి లీడ్ తీసుకొచ్చేందుకు కష్టపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను కులమతాల వారీగా విభజించి రాజకీయం చేస్తోందన్నారు. కానీ బీజేపీ మాత్రం కులమతాలకు అతీతంగా సబ్‌కాసాత్.. సబ్‌కా వికాస్ అనే నినాదంతో 10 ఏళ్ల పాటు దేశాన్ని ప్రపంచంలో నిలబెట్టిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కిందన్నారు. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రజల ముందుకు వెళుతున్నారన్నారు. రంజిత్‌రెడ్డిని ఎప్పుడూ బీజేపీ నాయకులు విమర్శించలేదన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ నేతలే రంజిత్‌రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు చేశారన్నారు. తమ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అవినీతి మరక లేకుండా వ్యాపారాలు, రాజకీయాలు చేశారని గుర్తు చేశారు. నాయకులు సుదర్శన్‌గౌడ్, జహీర్‌అబ్బాస్, రమేష్‌కుమార్, విక్రమ్ పాల్గొన్నారు.

కూచిపూడిలో ఘన‘కీర్తి’

- ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి వరుస అవార్డులు
- 2023లో రెండు జాతీయ పురస్కారాలు
- ఈ ఏడాది మయూరి జాతీయ పురస్కారం



మయూరి పురస్కారం అందుకున్న కీర్తి (ఫైల్)

కొందుర్గు: కూచిపూడి నృత్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కీర్తి ఉన్నతంగా రాణిస్తోంది. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పిర్జాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు పోమాల కీర్తి స్వగ్రామం కొందుర్గు. చిన్న వయసులోనే ఉపాధ్యాయ వృత్తిలో చేరింది. ఏడేళ్ల ప్రాయంలోనే నృత్యంపై ఆసక్తితో అజయ్ నటరాజ కళా నిలయంలో చేరి అధ్యాపకులు శ్రీదేవి, ప్రదీప్ కుమార్ వద్ద కూచిపూడి నృత్యం సాధన చేసింది. జిల్లా స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకుంది. 2023 ఫిబ్రవరిలో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో నిర్వహించిన నృత్య పోటీల్లో జాతీయ పురస్కారం అందుకున్నారు. ఏప్రిల్‌లో త్యాగరాయ గానసభలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనతో మహానంది జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ ఏడాది తెలుగు వెలుగు సాహితి వేదిక వారు నిర్వహించిన ఉగాది పురస్కారాలలో ప్రతిభచూపి మయూరి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతి మాత ఉపాసకులు దైవజ్ఞ శర్మ, తెలుగు వెలుగు సాహితి వేదిక గౌరవ అధ్యక్షులు వంగాల కాంతి కృష్ణ ఆచార్య, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ పురస్కారాన్ని అందజేశారు.

‘హస్తం’తోనే పాలమూరు అభివృద్ధి

- వంశీచంద్‌రెడ్డి సతీమణి అశ్లేషారెడ్డి
- షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యేతో కలిసి ఇంటింటి ప్రచారం



కేశంపేట: ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న అశ్లేషారెడ్డి, విశాల తదితరులు

కేశంపేట/కొత్తూరు: పాలమూరు అభివృద్ధి వంశీచంద్‌రెడ్డితోనే సాధ్యమని.. కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని భార్య చల్లా అశ్లేషారెడ్డి కోరారు. ఆదివారం ఆమె కేశంపేట మండల కేంద్రం, కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్లేషారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నా అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో విసిగిన ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారని.. అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిపించాలని కోరారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఉంటే ఇందిరమ్మ రాజ్యం ఏర్పడతుందని వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని చెప్పారు. అనంతరం స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ కొత్త మేనిఫెస్టోతో ఎన్నికలకు వస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను ఓట్ల కోసం వస్తే గతంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని నిలదీయలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

కొత్తూరులో..

కొత్తూరు మున్సిపాలిటీ నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. యువనాయకుడి పార్లమెంట్‌కు పంపిస్తే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓటేసి మోసపోవద్దన్నారు. ఆయా ప్రచారాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సతీమణి అనురాధ, కేశంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, ఎంపీటీసీ సభ్యుడు సురేశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, గిరియాదవ్, పల్లె ఆనంద్‌కుమార్, అమీర్, అల్వాల ప్రకాశ్‌గౌడ్, శశివర్ధన్ రెడ్డి, కోడూరు రాములు, పర్వతాలు, భాస్కర్‌రెడ్డి, గోపాల్ పార్టీ కొత్తూరు నాయకులు వేణుగోపాల్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, జనార్దన్‌చారి, మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, జగన్, మహేశ్‌గౌడ్, నర్సింహ, సురేందర్, ఆంజనేయులు, నందిగామ ఎంపీపీ ప్రియాంక, కౌన్సిలర్లు కరుణశ్రీ, హేమ, జయమ్మ పాల్గొన్నారు.